ఆలేరు వాసి ప్రదీప్‌కు ప్రధాని మోదీ ప్రశంస

కిలిమంజారో అధిరోహణతో కూడిన పటంపై సంతకం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఆలేరు టౌన్, నవంబర్ 17 : ఆలేరు పట్టణంలోని క్రాంతినగర్ కాలనీకి చెందిన కిలిమంజారో పర్వతారోహకుడు బిరుకూరి ప్రదీప్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఈ నెల 16న నైజీరియాలో పర్యటించిన సందర్భంలో ఆ దేశ రాజధాని అబుజా విమానాశ్రమంలో భారత ఎంబసీ అధికారులు, భారతీయులు నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో అక్కడి భారత రాయబార కార్యలయ అధికారులు ప్రదీప్ ధైర్య సాహసాలను ప్రధానికి వివరించారు. ఈ తరుణంలో అతని చిత్రపటంపై మోదీ సంతకం చేశారు. బిరుకూరి ప్రదీప్‌ను ప్రధాని ప్రశంసించి అభినందించారు.

పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

• భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, నవంబర్ 17 : భువనగిరి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో పట్టణ ప్రగతి, మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు రూ.1.63 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు వార్డులను సందర్శించి వెంటనే పనులు ప్రారంభించేలా కృషి చేస్తానని చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు బర్రె జహంగీర్, పోత్నాక్ ప్రమోద్ కుమార్, ఈరపాక నరసింహ పాల్గొన్నారు.

ఇంటింటి సమగ్ర సర్వే పరిశీలన

ఆత్మకూరు(ఎం)లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 17 : మండల కేంద్రంలో చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీఓ రాములునాయక్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటి యజమానితోపాటు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీఓ లోకేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్ ఉన్నారు.

జమ్మాపురంలో మెగా వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 17 : ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని జమ్మాపురం గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి షుగర్, బీపీ, న్యూరోపతి, బీఎండీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చావా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చావా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో పల్లె పల్లెకు వైద్యం పేరుతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో 114వ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, మాజీ సర్పంచ్ జ్యోతి, స్క్రీన్ ఎన్జీఓ ఆరోగ్యయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెలు సతమతం : సీపీఎం


ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రామన్నపేట, నవంబర్ 17 : ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య అన్నారు. కక్కిరేణి గ్రామంలో ఆదివారం ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామానికి బస్సు రాకపోవడంతో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఆటోలకు వెళ్లలేక చదువులు మానేస్తున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొరిగె సోములు, వేముల సైదులు, కన్నెబోయిన యాదయ్య, కృష్ణ, నరేందర్, నర్సింహ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

విరాళం అందజేస్తున్న దాతలు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 17 : మండలంలోని కొరటికల్‌లో పునర్నిర్మాణం చేపట్టిన శంభులింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం రేగులకుంట గ్రామానికి చెందిన గుడిశాల నారాయణ కుమారుడు శ్రీశైలంగౌడ్ జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని ఆదివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మురారిశెట్టి సురేశ్‌గుప్తా, మాజీ ఎంపీటీసీలు కందటి అనంతరెడ్డి, కట్టెకోల హన్మంత్, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు చామకూర నారాయణ, దాతలు మల్లికార్జున్, కిరణ్, కిషన్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

• సామూహికంగా కార్తిక వ్రతాలు

ఆలయ క్యూలైన్‌లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, నవంబర్ 17 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొన్నది. కార్తిక మాసంతోపాటు సెలవు కావడంతో స్వయంభూ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే మహిళలు దీపారాధనలో పాల్గొన్నారు. కొండ కింద వ్రత మండపం భక్తులతో సందడిగా మారింది. ఉదయం నుంచే సత్యనారాయణస్వామి వ్రతమాచరించేందుకు దంపతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 1,264 మంది దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారని ఆలయ అధికారులు తెలిపారు. కొండపైన విష్ణు పుష్కరిణి వద్ద స్నాన సంకల్పం, మాఢవీధుల్లో అఖండ దీపారాధనలో పాల్గొని తరించారు. శివాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల రాకతో తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్, శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారి ధర్మ దర్శనానికి 2గంటలు, వీవీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపి స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించారు. స్వామి, అమ్మవార్లతోపాటు క్షేత్ర పాలకుడికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. అర్చకులు స్వామి వారికి కల్యాణోత్సవసేవ, నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. ముఖ మండపంలో ఉదయం నుంచి రాత్రి వరకు సువర్ణమూర్తులను బంగారు పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధిసేవ, దర్బార్‌సేవ, తిరువారాధన, సహస్రనామార్చన అత్యంత వైభవంగా సాగింది. రాత్రి శయనోత్సవ సేవను శాస్త్రోక్తంగా గావించి ద్వారబంధనం చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి ఆర్జిత సేవలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి.

సుమారు 40వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 64,26,176 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని గౌహతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మిథాలి ఠాకూరియా కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

ఇద్దరు హెచ్ఎంలకు బెస్ట్ టీచర్స్ ఇన్‌స్పైరింగ్ అవార్డు

రాజాపేట, నవంబర్ 17 : మండలంలోని పారుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశికుమార్, రఘునాథపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పెంటపర్తి మాధవరెడ్డి బెస్ట్ టీచర్స్ ఇన్‌స్పైరింగ్ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం భాస్కర ఆడిటోరియంలో శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ చేతుల మీదుగా ఆదివారం అవార్డును అందుకున్నారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రాజాపేట ఎస్ఐ ఉపేందర్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్

రాజాపేట, నవంబర్ 17 : స్థానిక ఎస్ఐ ఉపేందర్ యాదవ్‌ను హెడ్‌క్వార్టర్‌కు అటచ్ చేస్తూ భువనగిరి డీసీపీ కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తుర్కపల్లి ఎస్ఐ తకియుద్దీన్‌కు రాజాపేట ఇన్‌చార్జి ఎస్ఐగా బాధ్యతలు అప్పగించారు. మండలంలోని రఘునాథపురం గ్రామంలో వృద్ధుడి హత్య విషయంలో నిందితుడితో ప్రాణహాని ఉన్నదని గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్ఐ ఉపేందర్ స్పందించకపోవడంతో ఆయనపై వేటు పడింది.

గోవులు తరలిస్తున్న వాహనం సీజ్

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 17 : అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని చౌటుప్పల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద 17 మూగ జీవాలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. చార్మినార్‌కు చెందిన డ్రైవర్ మహమ్మద్ ఆజామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. సూర్యాపేట జిల్లా కోదాడలో మూగ జీవాలను ఖరీదు చేసి హైదరాబాద్‌లోని బహుదూర్‌పురాకు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యాదిరెడ్డి తెలిపారు.

'గౌడ మఠం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి'

ఆలేరు రూరల్, నవంబర్ 17 : మండలంలోని కొలనుపాక గౌడ మఠం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని గౌడ సంఘం అధ్యక్షుడు మాసపేట రాజుగౌడ్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ మఠం అభివృద్ధికి రాష్ట్రంలోని గౌడ కులస్తులు కూడా సహకరించాలన్నారు. సమావేశంలో గౌడ సంఘం నాయకులు బైరి భిక్షపతి, దూడల భాగయ్య, మిట్టపల్లి సుభాశ్, గణేశ్, సందీప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజుగౌడ్

భారత రాజ్యాంగ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

రాజ్యాంగ రజతోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట, నవంబర్ 17 : మహాత్మ జ్యోతిరావు పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, ప్రజా పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి జనవరి 26వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న భారత రాజ్యాంగ రజతోత్సవాల పోస్టర్‌ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ విశిష్టత ప్రజలందరికీ చేరేలా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్న సంస్థలకు అభినందనలు తెలిపారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమయ్యే 60 రోజుల కార్యక్రమానికి ప్రజలంతా హాజరై పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య కళాశాలల్లో సెమినార్లు, సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు సురుపంగ శివలింగం, బానోతు భాస్కర్‌నాయక్, ఇటుకల దేవేందర్ మాదిగ, కేసరి యూత్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రేగు బాలనర్సయ్య, బూడిద నాగరాజు పాల్గొన్నారు.

హైవేలపై వాహనాల రద్దీ

బీబీనగర్ : గూడూరు టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

బీబీనగర్/ చౌటుప్పల్ రూరల్, నవంబర్ 17 : బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద వరంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనాలు బారులు దీరాయి. కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చౌటుప్పల్ పట్టణంలో 65వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆదివారం పెండ్లిళ్లు ఎక్కువగా ఉండటంతో జాతీయ రహదారులపై పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు జరుగడంతో అక్కడక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది.

పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశం

భూదాన్ పోచంపల్లి : వెంకటేశానికి నియామక పత్రం అందజేసున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 17 : తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూదాన్ పోచంపల్లికి చెందిన గడ్డం వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ పద్మశాలీల సంక్షేమం, అభ్యున్నతికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, కార్యదర్శి అప్పం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చిరందాస్ ధనుంజయకు కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన బింగి భిక్షపతి పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు చందుపట్ల గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుర్రం పుల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం భిక్షపతిని సన్మానించారు. గ్రామానికి చెందిన భిక్షపతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు మంగళపల్లి బాలయ్య, చింతకింది ఆంజనేయులు, ముసునూరి చంద్రయ్య, డాక్టర్ కస్తూరి వెంకన్న, గుర్రం తిరుమలేశ్, గుర్రం నాగరాజు, గుర్రం శ్రీనివాస్, గుర్రం సురేశ్ పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : భిక్షపతిని సన్మానిస్తున్న చందుపట్ల పద్మశాలి సంఘం నాయకులు

మూతపడ్డ హోమియోపతి దవాఖాన

కొలనుపాకలో మూతపడ్డ హోమియోపతి దవాఖాన

ఆలేరు రూరల్, నవంబర్ 17 : మండలంలోని కొలనుపాకలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ హోమియోపతి దవాఖాన 30ఏండ్లుగా వైద్య సేవలు అందించి ఎంతో మంది ఆరోగ్యాన్ని మెరుగుపర్చింది. అలాంటి దవాఖాన 3నెలల నుంచి మూతపడింది. దాంతో వైద్య సేవలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ బదిలీలో భాగంగా ఇక్కడి వైద్యురాలు మూడు నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. అప్పటి నుంచి వైద్యాధికారిని నియమించకపోవడంతో దవాఖాన మూతపడింది. దీంతో హోమియోపతి మందులు వాడే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే హోమియోపతి వైద్యాధికారిని నియమించి దవాఖానను తెరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండేండ్ల నుంచి హోమియోపతి మందులు వాడుతున్నాం

నేను రెండు సంవత్సరాల నుంచి హోమియోపతి మందులు వాడుతున్నా. హోమియోపతి మందులు అల్సర్, మోకాళ్ల నొప్పులకు మంచిగా పనిచేసేవి. నాతోపాటు మా పిల్లలు కూడా ఆ మందులను వాడేవారు. 3నెలల నుంచి దవాఖాన మూతపడడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి వైద్యాధికారిని నియమించి దవాఖానను అందుబాటులోకి తీసుకురావాలి.

– బొద్దుల సిద్ధులు, రఘునాథపురం, రాజాపేట మండలం


సైదాపురం చెరువులో గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

సైదాపురం చెరువులో గంగమ్మకు పూజలు

యాదగిరిగుట్ట, నవంబర్ 17 : మండలంలోని సైదాపురం చెరువులో గంగమ్మకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పూజలు నిర్వహించారు. ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఓటీ కాల్వ ద్వారా మండలంలోని సైదాపురం గ్రామ చెరువులోకి గోదావరి జలాలు వచ్చి చేరాయి. ఈ సందర్భంగా ఆదివారం ప్రభుత్వ విప్ ఐలయ్య చెరువులో పసుపు, కుంకుమ, పూలతో పూజలు చేసి గోదారమ్మకు స్వాగతం పలికారు.

కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ బీర్ల శంకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

• తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

చౌళ్లరామారం ఐకేపీ సెంటర్‌లో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సామేల్

అడ్డగూడూరు, నవంబర్ 17 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని చౌళ్లరామారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ శాతం ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబెట్టాలని రైతులకు సూచించారు. అందుబాటులో లేని కొంతమంది రైతులకు ఫోన్ చేసి ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని చెప్పారు. సన్నాలకు ప్రభుత్వ మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురజాల నుంచి చౌళ్లరామారం వరకు రూ.16 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. డి.రేపాక గ్రామ శివారులో పరిశ్రమ, ఐటీఐ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఏపీఎం వెంకటేశ్వర్లు, ఏఓ పాండురంగాచారి, ఏఈఓ అక్షర, కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు సుజాత పాల్గొన్నారు.

సామూహిక నిరసన దీక్షను విజయవంతం చేయాలి : సీపీఎం

ముత్తిరెడ్డిగూడెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 17 : బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కోసం రూ.500 కోట్లు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 20న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సామూహిక నిరసన దీక్షలో ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ కోరారు. సీపీఎం ఇంటింటి కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో ఆదివారం ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించడానికి నిర్మాణం చేపట్టిన బస్వాపూర్ ప్రాజెక్టు పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బస్వాపూర్ రిజర్వాయర్‌లోకి చుక్క నీరు కూడా తేవడం లేదని, తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లోని చెరువులను మాత్రం నింపుతున్నారని తెలిపారు. ఈ ప్రాంత చెరువులను ఎందుకు నింపడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాంత చెరువులను నింపాలని, ముంపు గ్రామాలకు నష్టపరిహారం, ప్రాజెక్టు పూర్తి కోసం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వాటి సాధన కోసం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలో రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు, రైతులు, ముంపు గ్రామాల బాధితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

మహా పడి పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

బీబీనగర్, నవంబర్ 17 : మండలంలోని గూడూరు గ్రామ శివారులో గల బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో మౌనిక ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ తూడి సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి పింగళ్‌రెడ్డి, శ్యామ్‌గౌడ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలంగౌడ్, నిఖిల్‌రెడ్డి, వాసుదేవ రెడ్డి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కొండమడుగు పాఠశాల 2007– 2008 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

బీబీనగర్, నవంబర్ 17 : మండలంలోని కొండమడుగు గ్రామ ప్రభుత్వ పాఠశాల 2007–2008 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారు ఎన్నో ఏండ్ల తర్వాత కలుసుకుని మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్‌రావు, సుధాకర్‌రెడ్డి, రామయ్య, సత్యనారాయణ, అనూరాధ, విద్యార్థులు మహేశ్, శ్రీశైలం, కిరణ్, రాజు, అజయ్, అన్వర్ అలీ, కృష్ణ, రవి, భరత్‌గౌడ్, మహేందర్, శ్రీకాంత్, చారి, లక్ష్మీప్రసన్న, కళ్యాణి, భాగ్యలక్ష్మి, నాగవేణి, షాలిని పాల్గొన్నారు.